## క్లుప్తంగా

### 'ఆడుదాం ఆంధ్ర'లో నమోదు చేసుకోండి

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకుల్లో క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం–ఆంధ్ర' రాష్ట్రవ్యాప్త క్రీడాపోటీలను ప్రారంభించిందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లు నిండి ఆసక్తి గలిగిన వారు www.aadudamandhra.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలో ఇప్పటికే దాదాపు 300 మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఒక్కరూ ఆంధ్రా టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ నెల 15 నుంచి పోటీలు ప్రారంభం అవుతాయని తెలిపారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ధ్యానంతో ఆనందమయ జీవితం



ప్రసంగిస్తున్న డాక్టర్ హరిప్రసాద్

మద్దికెర: ఆనందమయ జీవితానికి హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన పద్ధతి ఎంతగానో సహకరిస్తుందని చిన్న పిల్లల వైద్య నిపుణులు, అబ్బా టీవీ ఫేం డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ధ్యాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరుకులు పరుగుల జీవితంలో మనిషి అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ధ్యాన పద్ధతులు పాటించడం ద్వారా జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చని వివరించారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు సమయాలలో ఈ పద్ధతి పాటించాలన్నారు. ఆర్ఎంఎస్ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, పక్కీరప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆముదం పంట మేసి 8 పశువులు మృత్యువాత

దేవనకొండ: మండలంలోని బేతపల్లి గ్రామంలో ఆముదం పంటను మేసిన 40 ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే పశువైద్యాధికారి ఎస్.జి.వెంకటేష్, జేవీఓ శివనారాయణరెడ్డి పశువులకు చికిత్స అందించారు. వాటిలో 8 పశువులు మృత్యువాత పడ్డాయి. మిగతా 32 పశువులకు ప్రాణహాని లేకుండా చికిత్స అందించినట్లు వైద్య సిబ్బంది చెప్పారు. మృతిచెందిన పశువుల యజమానులకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూడాలని గ్రామస్తులు పశువైద్యాధికారులను కోరారు. పశువులకు చికిత్స అందించిన వారిలో వీఏలు హనుమన్న, విజయ్, అమృతరాజు, ఏహెచ్ఏ, సిబ్బంది ఉన్నారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



ఎమ్మిగనూరులో విభిన్న ప్రతిభావంతులకు చెక్కు అందిస్తున్న మెప్మా సీఎంఎం

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పథకాలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సీఎంఎం జయవర్ధన్ సూచించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో ఆదివారం విభిన్న ప్రతిభావంతులైన మూడు గ్రూపులకు మంజూరైన రూ.12 లక్షల చెక్కును, సున్నా వడ్డీ కింద రూ.50 వేలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు మంజూరైన రుణాన్ని వారి అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల చట్టాలను వివరించారు. మెప్మా డీఈఓ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### దేవరగట్టులో కార్తీక మాస పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో కార్తీక మాసంలో భాగంగా ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజా, నివేదన, నీరాజన మొదలైన ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్‌మూర్తులకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే సంతాన లక్ష్మిగా వెలుగొందుతున్న మాత మాళమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీతో పాటు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

# మద్దికెరకు మహర్దశ

- అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు
- రూ.75.50 లక్షల నిధుల మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



మద్దికెరలో అధ్వానంగా ఉన్న రోడ్డు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, వీధి కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మండలంలో సీసీ రోడ్లు, వీధి కాలువల నిర్మాణానికి మద్దికెరకు రూ.75.50 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. త్వరగా పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ప్రజాప్రతినిధులు సూచనలు చేశారు.

#### పుష్కలంగా నిధులు

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వెంటనే పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులు సకాలంలో పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. త్వరలో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి.
– మోహన్‌నాయక్, పీఆర్ఏఈ, మద్దికెర

#### గ్రామాభివృద్ధే ధ్యేయం



ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రధాన లక్ష్యం. మద్దికెరలో రూ. 75.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే మండలంలోని ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోంది.
– మురళీధర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, మద్దికెర

గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)

| | |
|---|---|
| సచివాలయం - 1 | |
| కమ్మరాజన్న ఇంటి నుంచి పోతుగంటి మాదన్న ఇంటి వరకు | 3.30 |
| స్టోర్ రాముడు ఇంటి నుంచి ముస్టూర్ గోపాల్ హౌస్ వరకు | 2.10 |
| టైలర్ హరి ఇంటి నుంచి చాకలి లక్ష్మన్న ఇంటి వరకు | 4.65 |
| గాంధీ విగ్రహం నుంచి బోయఉల్లెక్కప్ప ఇంటి వరకు | 5.00 |
| కవిరెడ్డి భీమన్న ఇంటి వద్ద నుంచి జెండా కట్ట వరకు | 4.95 |
| సచివాలయం-2 | |
| స్టోర్ రాముడు ఇంటి నుంచి ప్రతాప్ వెల్డింగ్ షాప్ | 3.70 |
| బంగిరాముడు ఇంటి నుంచి సురేష్ ఇంటి వరకు | 3.20 |
| హోసూరు లక్ష్మినారాయణ ఇంటి నుంచి అంజనయ్య ఇంటి వరకు | 4.60 |
| తూగొండ మల్లమ్మ ఇంటి నుంచి ఈశ్వరమ్మ ఇంటి వరకు | 3.50 |
| భరత్ క్లినిక్ నుంచి తూగొండ మల్లమ్మఇంటి వరకు | 5.00 |
| సచివాలయం -3 | |
| కమతం వీరేష్ ఇంటి నుంచి కాలువ రామకృష్ణ ఇంటి వరకు | 1.00 |
| బండమీద రాజేంద్ర ఇంటి నుంచి కటికె కామాలి ఇంటి వరకు | 1.50 |
| చుక్కలూరు నాగేంద్ర ఇంటి నుంచి కమతం వీరేష్ ఇంటి వరకు | 5.00 |
| గడ్డం ఎర్రిస్వామి ఇంటి నుంచి హనుమంతు ఇంటి వరకు | 5.00 |
| రామదుర్గం కిష్టప్ప ఇంటి నుంచి ఎర్రిస్వామి ఇంటి వరకు | 5.00 |
| ఉప్పర సంధ్య ఇంటి నుంచి వాసుదేవచార్యులు ఇంటి వరకు | 2.50 |
| సచివాలయం-4 | |
| కవిదాసు ఇంటి నుంచి కల్వర్టు వరకు | 2.00 |
| గుడి శివన్న ఇంటి నుంచి సొసైటీ రోడ్డు వరకు టీటీ | 1.00 |
| ఓహెచ్ఎస్ఆర్ నుంచి గుడిశివన్న ఇంటివరకు | 5.00 |
| కుంటి ఎర్రిస్వామి ఇంటి నుంచి ఓహెచ్ఎస్ఆర్‌వరకు | 5.00 |
| గాజుల హంపయ్య ఇంటి నుంచి | 2.50 |
| మొత్తం | రూ.75.50 లక్షలు |

### జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



ఆలూరు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన ద్వారా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ కేంద్రాలతో పాటు లబ్ధిదారులకు అందించిన సంక్షేమ లబ్ధిపై ప్రచారం చేసి జగనన్నకు మద్దతుగా నిలిచేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా బోగస్ ఓటర్లు, డబుల్ ఎంట్రీలపై టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండి వాటిని తిప్పికొట్టాలని సూచించారు.

### నేడు 'స్పందన'

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలన్నారు.

## వరిగడ్డికి డిమాండ్



ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తున్న దృశ్యం

హొళగుంద: వర్షాభావ పరిస్థితులు, అతివృష్టి కారణంగా పశువుల మేతకు గ్రాసం కొరత ఏర్పడడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఎకరా వరిగడ్డి రూ.2 వేల వరకు ఉండగ ట్రాక్టర్ గడ్డి రూ.3,500 నుంచి రూ.4,500 వరకు పలుకుతోంది. కొనుగోలు చేసి తీసుకొచ్చేందుకు ఖర్చులు కలిపి దాదాపు రూ.10 వేల వరకు పెట్టుకోవాల్సి వస్తోంది. ఇతర జిల్లాలకు చెందిన రైతులు కూడా ఇక్కడికి వచ్చి గడ్డిని తీసుకెళ్తున్నారు. వీరికి ఖర్చు మరింత పెరుగుతుంది. ఈ నెల 10వ తేదీ ఎల్లెల్సీకి నీటి సరఫరా నిలిచి పోనుండడం, రబీ (వేసవి)కి సాగు నీరు లేక పోవడంతో వరిసాగు జరగదు. దీంతో ముున్ముందు పశుగ్రాసం కొరత ఏర్పడితే కష్టమని భావించి ఇప్పటి నుంచే రైతులు గడ్డిని కొని నిల్వ చేసుకుంటున్నారు. ఇంతకుముందు కర్ణాటక నుంచి రైతులు గడ్డిని కొని తీసుకెళ్తుండగా ఈ ఏడాది అక్కడ కూడా ఇదే సమస్య ఉండడంతో డిమాండ్ పెరిగింది. గతంలో గడ్డిని అమ్మే రైతులు కూడా ఈ ఏడాది అమ్మకుండా తామే నిల్వ చేసుకుంటున్నారు. పొలాలు లేని వారు పశువుల మేత ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు.

## టీబీ డ్యాంలో 13 టీఎంసీల నీటి నిల్వ

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో 1592.50 అడుగుల వద్ద 13 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 91 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. ఈ ఏడాది వర్షాభావం కారణంగా అతి తక్కువ నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇక ఇన్‌ఫ్లో కేవలం 933 క్యూసెక్కులుండి ఔట్‌ఫ్లో 1,929 క్యూసెక్కులుంది. టీబీ డ్యాం నుంచి కర్నూలు జిల్లాలో ప్రవహించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 680 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

## దివ్యాంగులు మేధస్సుతో రాణించాలి



మాట్లాడుతున్న చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి

ఆలూరు: దివ్యాంగులు మేధాశక్తికి పదును పెట్టి సాధారణ వ్యక్తులతో సమానంగా రాణించాలని ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ జోనల్ అధ్యక్షుడు, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి సూచించారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్డీటీ ఆడిటోరియంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆలూరు మండలం శ్రీసాయి దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మొలగవెల్లి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విరుపాక్షి, సెక్రెడ్ సంస్థ ఆర్గనైజర్ బాలరాజు, దివ్యాంగుల సంఘం మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, నాయకులు గాదిలింగప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగుల గురించి వివరించి స్ఫూర్తి నింపారు. దేవరగట్టులో గత నెలలో జరిగిన బన్నీ ఉత్సవాలలో ఆలూరు మండలం మనేకుర్తికి చెందిన చిన్న పెద్దయ్య కాలికి తీవ్ర గాయం కావడంతో రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

### కమ్మ సంఘం కార్తీక వనభోజనం

పత్తికొండ రూరల్: పత్తికొండ బైపాస్ రోడ్డులోని రమ్య రిసార్ట్‌లో కమ్మ సంఘం కార్తీక వనభోజనం మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి కమ్మ వర్గీయులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కాకతీయ కమ్మ సంఘం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వేలూరు రామప్ప, జరగల రాంబాబు మాట్లాడుతూ.. ఐకమత్యంతోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రముఖ వ్యాపారులు పారావిశ్వనాథ్, పారా ప్రసాద్ సోదరులు 100 మంది వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. సంఘం తరపున 10 మంది పేద విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అందరూ కలిసి భోజనం చేశారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు వైకుంట ప్రతాప్, మనోహర్‌చౌదరి, సురేష్‌చౌదరి, చల్లార వీంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం పత్తికొండలో నాలుగు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.11 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వారికి పంపిణీ చేశారు.

- తుగ్గలి మండలం కొత్తపల్లిలో రెండు నెలల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సుధాకర్ అనే రైతు కుటుంబానికి చెందిన మల్బరీ షెడ్ పూర్తిగా దగ్ధం అయ్యింది. ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది.
- పత్తికొండ మండలం పందికోన గ్రామానికి చెందిన హరిజన అంజలి అనే చిన్నారి కొన్ని నెలల క్రితం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందింది. ఆ కుటుంబానికి రూ.2 లక్షలు మంజూరయ్యాయి.
- మద్దికెర మండలం హంప గ్రామానికి చెందిన గుడికాటి ఉదయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబానికి రూ.2 లక్షలు మంజూరయ్యాయి.
- క్రిష్ణగిరి మండలం గుడెంపాడుకు చెందిన శ్రీ కైవల్య క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్నారు. వారికి రూ.2 లక్షలు మంజూరు చేసింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులలో చికిత్స పొందిన వారికి, అలాగే బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ తోడ్పాటు అందిస్తుందన్నారు. మద్దికెర జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున, కోతిరాళ్ల సర్పంచ్ అంజినయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పగిడిరాయి రంగనాథరెడ్డి, నాగరాజు, రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, హుసేన్, సీతారామిరెడ్డి, హంప లక్ష్మీకాంతరెడ్డి తదితరులు ఉన్నారు.

### కేంద్ర మంత్రిని కలిసిన వాల్మీకి నాయకులు



ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

హొళగుంద: పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదివారం వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభీంనాయుడు, వాల్మీకి సీనియర్ నాయకుడు పంపాపతి తదితరులు కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏపీలో 40 లక్షల మంది వాల్మీకులు ఉన్నారని తెలిపారు. వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ క్యాబినెట్, అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపినట్లు గుర్తు చేశారు. సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప వెంట ఉన్నారు.

### ప్రశాంత జీవనం గడపాలి

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత జీవనం గడపాలని ఎస్ఐ సురేష్ సూచించారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని, అలా కాకుండా పంతాలు పట్టింపులకుపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలని, వారిని మంచి మార్గంలో నడిపించేలా కృషి చేయాలన్నారు. అలాగే రహదారి ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేసినా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో అందరూ ఐకమత్యంగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

## ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

పత్తికొండ రూరల్: వైకల్యం ఉందని బాధపడకుండా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని ఆదర్శ ప్రాంతీయ దివ్యాంగుల సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు వీరప్రకాశ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పట్టణంలోని ప్రధాన రోడ్డు గూండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను విభిన్న ప్రతిభావంతులుగా గుర్తించాలన్నారు. వైకల్యాన్ని జయించి గొప్ప వ్యక్తులుగా ఎదిగిన వారి గురించి వివరించారు. సెక్రెడ్ సంస్థ ప్రతినిధులు లక్ష్మీప్రసన్న, ఉరుకుందమ్మ, హనుమంతు, శ్రీనివాసులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ



తుగ్గలి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి

తుగ్గలి: మండల పరిధిలోని రాతన, తుగ్గలిలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం పత్తికొండ ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి తనిఖీ చేశారు. ఓటరు దరఖాస్తు ఫారాలు, బీఎల్ఓల రిజిష్టర్లను పరిశీలించారు. చనిపోయిన వారి ఓట్లను జాబితాల నుంచి తొలగించాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రవి, సీనియర్ అసిస్టెంట్ రాముడు, ఆర్ఐ సుధాకర రెడ్డి ఉన్నారు.

గోనెగండ్ల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. గోనెగండ్ల, హెచ్.కైరవాడి, పుట్టపాశం, వేముగోడు గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ వేణుగోపాల్ పరిశీలించారు. బీఎల్ఓలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 68 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఈ నెల 9వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు విశేష స్పందన లభించింది. కృష్ణగిరి, ఎరుకలచెరువు గ్రామాల్లో ఆదివారం జరిగిన నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ రాజేశ్వరి పరిశీలించారు. క్యాంపులో కొత్తగా ఓటరు నమోదుకు – 670, మార్పులు, చేర్పులకు – 220, తొలగింపులకు – 142 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇంకా మిగిలిన వారు ఆయా గ్రామాల బీఎల్ఓలను సంప్రదించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

మద్దికెర: మండలంలోని పోలింగ్ బూత్ కేంద్రాలలో బీఎల్ఓలతో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించగా 112 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నాగభూషణం ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు కొరకు ఫారం 6 – దరఖాస్తులు–76 , తొలగింపులకు ఫారం– 7 దరఖాస్తులు –4, ఫారం– 8 మార్పులు చేర్పుల కోసం 32 వచ్చినట్లు తెలిపారు. వీఆర్వోలు రంగస్వామి, బాలవర్ధిరాజు, బీఎల్ఓలు జాకీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నాడు అధ్వానం.. నేడు సౌకర్యవంతం





నేడు - ముక్కెల్ల ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, నాడు - గతంలో రోడ్డు దుస్థితి

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్లలో గతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక గ్రామస్తులు అవస్థలు పడేవారు. ఏ వీధి చూసినా మురుగుతో దర్శనమిచ్చేది. నడవడానికే వీలు లేకుండా ఉండేది. గత టీడీపీ హయాంలో గ్రామ సర్పంచ్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కావడంతో అభివృద్ధి ఆ ప్రభుత్వం విస్మరించింది. నేడు అదే గ్రామంలో టీడీపీ మద్దతుదారురాలు సర్పంచ్‌గా ఉన్నా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపలేదు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవ చూపి ఆర్అండ్‌బీ నిధులు రూ.20 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, ఎంపీ నిధులు మరో రూ.20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో మురుగు కష్టాలు తొలగాయి. గ్రామాభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### వాల్మీకులు ఐక్యంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: వాల్మీకుల సమస్యల పరిష్కారానికి ఐక్యతతో కృషి చేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీప్రసాద్, ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య సూచించారు. ఆదివారం పట్టణంలోని గ్లోబల్ ఇండస్ స్కూల్లో వాల్మీకుల కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వాహకులు బంగారు వెంకటేష్, కొండయ్య, రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ భవానీప్రసాద్, డీఎస్పీ వెంకటరామయ్య, ఆర్థోపెడిక్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ రేఖ హాజరై వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అతిథులు మాట్లాడుతూ వాల్మీకుల చిరకాల కోరిక ఎస్టీ రిజర్వేషన్ సాధించుకోవడమేనని చెప్పారు. అందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. వాల్మీకి పెద్దలు గిడ్డయ్య, జయరాం, విజయకుమార్, జ్ఞానేశ్వరమ్మ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూపురేఖలు మారిన బీసీ కాలనీ





నేడు- యాటకల్లు బీసీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, నాడు- బురదమయంగా ఉన్న రోడ్డు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామం బీసీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణంతో రూపురేఖలే మారిపోయాయి. కాలనీలో గతంలో రోడ్డు లేకపోవడంతో గుంతలు పడి అధ్వానంగా ఉండేది. వర్షాకాలంలో బురదమయంగా ఉన్న రోడ్డులో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలైన సందర్భాలు ఉన్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా యాటకల్లుకు వచ్చిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు సర్పంచ్ సుధమ్మ సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి సచివాలయం నిధులు రూ.20 లక్షలను సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. రోడ్డు నిర్మాణం పూర్తయి వాహనాల రాకపోకలకు సౌకర్యంగా మారడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

దేవనకొండ: మండలంలోని వరిముక్కల గ్రామానికి చెందిన కుక్కల నరసన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం ఏర్పడింది. మంటలు చెలరేగడంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని నిత్యావసర సరుకులతో పాటు టీవీ, ఫ్యాన్‌లు, మొత్తం సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సుమారుగా రూ.80 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, సర్పంచ్ పెద్దమల్లయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.